క్లుప్తంగా

ఉమాచోడేశ్వరస్వామికి విశేష పూజలు



స్వామి వారికి బిల్వార్చన చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామి వారికి బిల్వార్చన నిర్వహించారు. పట్టణానికి చెందిన బాలప్ప ప్రసాద్, జానకి దంపతుల చేతులమీదుగా ఈ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొతవరపు భాను, దేవర కొండ సాయిప్రసాద్, ఉమామహేశ్వర శర్మ పూజలను పర్యవేక్షించారు. రామూరి ప్రసాద్, తెన్నేటి సూర్యనారాయణ, దర్భా అప్పల నరసింహమూర్తి, చల్లా సూర్యనారాయణ, వాడ్రేవు సాయి కామరాజు, తిప్పాబొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పడవల ఇసుక ర్యాంపులు తెరిపించాలి

డిప్యూటీ సీఎం పవన్‌కు వినతి పత్రం

కొవ్వూరు: మూడు నెలలుగా పడవల ఇసుక ర్యాంపులు తెరుచుకోకపోవడంతో సుమారు మూడు వేల మంది కార్మికులు, యాజమానులు ఉపాధి కోల్పోయారని సీతంపేట, విజ్జేశ్వరం బోట్స్‌మెన్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రాష్ట్ర రాజధానిలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. గత 50 ఏళ్లుగా సుమారు 70 బోట్లు ఇసుక సేకరణ ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. విజ్జేశ్వరం నుంచి తాళ్లపూడి వరకూ దాదాపు పది వేల మంది కార్మికులు పడవల ద్వారా ఇసుక సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. మూడు నెలలుగా ఈ ర్యాంపులు మూత పడడంతో కుటుంబ పోషణ భారమై వారంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక ర్యాంపులు తెరిపించి జీవనోపాధి కల్పించాలని కోరారు.

పచ్చిమేతతోనే అధిక పాల ఉత్పత్తి



పశువుల పచ్చిమేతపై అచ్చన్నపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ జాన్‌మోజెష్ వెస్లీ

నల్లజర్ల: పచ్చిమేతతోనే పశువుల్లో అధిక పాల ఉత్పత్తి జరుగుతుందని పశుసంవర్ధక శాఖ నల్లజర్ల ఏడీ జాన్‌మోజెష్ వెస్లీ పాడి రైతులకు సూచించారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని అచ్చన్నపాలెం గ్రామంలో నిర్వహించారు. పచ్చి మేత పెంపకంపై క్షేత్ర స్థాయిలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. బహువార్షిక పశుగ్రాసాలైన రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్న్, సుబాబుల్, తైవాన్ నేపియర్, అవిస తదితర గడ్డి రకాల పచ్చిమేతను పశువులకు అందిస్తే అధిక పాల ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. ఏక వార్షిక జొన్న రకానికి చెందిన విత్తనాలకు 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. రైతులు సొంతంగా గడ్డి రకాలు పెంచుకుంటే మంచి దాణాతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. బహువార్షిక గడ్డి రకాలు ఎకరానికి 400 టన్నుల వరకూ పశుగ్రాసాన్ని ఉత్పత్తి చేస్తాయన్నారు.

పెరవలిలో చెక్‌పోస్టు ఏర్పాటు

నిడదవోలు: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహనాల తనిఖీకి జాతీయ రహదారిపై పెరవలి గ్రామంలో ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) నిడదవోలు సీఐ కె. రామబ్రహ్మం తెలిపారు. ఎస్ఈబీ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు, ఏలూరు జిల్లాకు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని ఆయన తెలిపారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి

నిడదవోలు: గ్యారంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్) అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు ఆదివారం ఒక ప్రకటలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ సంఘాలతో సీపీఎస్‌పై చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు చేస్తామని టీడీపీ, జనసేన కూటమి హామీ ఇచ్చిందన్నారు. తీరా ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం రూపొందించిన జీపీఎస్ విధానం అమలుకు వీలుగా గెజిట్ జారీ చేయడం అన్యాయమన్నారు. దీనివల్ల ఉద్యోగులు చాలా నష్టపోతారని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉచితం అంటూనే దోపిడీ

- టన్ను ఇసుకకు రూ.270 చొప్పున వసూలు
- రవాణా చార్జీలు అదనం సమ్మెలోకి లారీ ఓనర్లు
- పందలపర్రులో పని చేయని వేబ్రిడ్జి
- నియోజకవర్గంలో మూడుచోట్ల స్టాక్ పాయింట్లు



పందలపర్రులో స్టాక్ పాయింట్ నుంచి ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం



స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిడదవోలు రూరల్: మేం గెలిస్తే ఇసుక ఉచితం.. అంటూ చిలక పలుకులు పలికిన అధికార కూటమి నేతలు.. ఇప్పుడు అసలు సినిమా చూపిస్తున్నారు. పాత షరతులే వర్తించేలా నిర్ణయాలు అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఇసుక పాలసీని ఈనెల 8 నుంచి ప్రభుత్వం తీసుకొచ్చింది. నిడదవోలు నియోజకవర్గంలోని పందలపర్రు, పెండ్యాల, ఉసులుమర్రు ఇసుక ర్యాంపుల పరిధిలోని ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. వాస్తవానికి ఇసుక ఉచితం అని చెబుతూనే సీనరేజి, లోడింగ్‌తో పాటు ఇసుక రేవులో బాటల నిర్వహణ కోసం అంటూ టన్నుకు రూ.270 చొప్పున వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో జగనన్న కాలనీలకు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు అందజేసేందుకు కొన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల వద్ద సిద్ధం చేసిన భారీ ఇసుక నిల్వలను ఇప్పుడు వ్యాపార, వాణిజ్య అవసరాలను విక్రయిస్తున్నారు.

మూడు స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా

ఇసుక పాలసీ అమల్లో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గంలోని నిడదవోలు మండలం పందలపర్రులో 52.082 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 1,46,249 మెట్రిక్ టన్నులు, పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద 33,065 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఉన్నట్లు గుర్తించి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. అయితే పందలపర్రులో వే బ్రిడ్జి పనిచేయక పోవడంతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను విక్రయిస్తున్నారు. ఇసుక విక్రయాలకు ప్రతి ర్యాంపు వద్దా డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని నియమించారు. టన్నుకు రూ.270 వసూలు చేసి బిల్లు అందిస్తున్నారు. దీంతో 10 టన్నుల క్వారీ లారీకి రూ.2700, అలాగే 20 టన్నుల టిప్పర్ లారీకి రూ.5,400 చొప్పున స్టాక్ పాయింట్ వద్ద చెల్లించాలి. దీంతో పేరుకే ఉచిత ఇసుక తప్ప వాస్తవంగా అమలు కావడం లేదని కొనుగోలుదారులు వాపోతున్నారు. సీనరేజి, లోడింగ్‌తో పాటు బాటల నిర్వహణ పేరిట ప్రభుత్వం దోచుకుంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కూటమి నేతలకు సంబంధించిన వారికే లోడింగ్, బాటల నిర్వహణ కాంట్రాక్టులు ఇచ్చి అధికారులు స్టాక్ పాయింట్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలోని ర్యాంపుల్లో ఇసుక వివరాలు

మండలం	ర్యాంపు పేరు	అందుబాటులో ఉన్న ఇసుక (మెట్రిక్ టన్నుల్లో)
నిడదవోలు	పందలపర్రు	52,082
నిడదవోలు	పెండ్యాల	1,46,249
పెరవలి	ఉసులుమర్రు	33,065



పందలపర్రులో స్టాక్ పాయింట్ వద్ద పనిచేయని వేబ్రిడ్జి

ఇష్టానుసారంగా చార్జీల వసూలు

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.270 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్న నిర్మాణదారులకు రవాణా చార్జీల పేరిట లారీల నిర్వాహకులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. 10 కిలోమీటర్ల పరిధిలో క్వారీ లారీకి రూ.2500 నుంచి రూ.3 వేలు, టిప్పర్ లారీ రూ.5 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అంతేగాక ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే విక్రయించేలా నిబంధన పెట్టారు. అదీగాక ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే ఇసుక విక్రయాలు సాగిస్తున్నారు. ఈ ఒక లారీకి రోజుకు ఒకే ట్రిప్పు పడుతుండడంతో లారీల నిర్వాహకులు రవాణా చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు. కొంతమంది అక్రమదారులు స్టాక్ పాయింట్ల నుంచి కొనుగోలు చేసిన ఇసుకను ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేసి వర్షాకాలంలో అధిక రేట్లకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇసుక తీసుకునేందుకు ఇంటి ప్లాన్ కావాలని స్టాక్ పాయింట్ వద్ద అధికారులు చెప్పడంతో నిబంధనలు సడలించాలని కోరుతూ లారీ ఓనర్స్ సమ్మె బాట పట్టారు.

స్టాక్ పాయింట్ల నుంచి అక్రమంగా అమ్మేసి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముందస్తుగా కొన్ని ప్రాంతాలను గుర్తించి అవసరం మేరకు ఇసుకను స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టాక్ పాయింట్ల నుంచి అక్రమంగా ఇసుకను అమ్మేశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసులు సైతం అటువైపు కన్నెత్తి చూడ లేదు. మళ్లీ కొత్త ఇసుక పాలసీ రావడంతో స్టాక్ పాయింట్ల నుంచి కూటమి నేతలు దోచుకున్నాక మిగిలిన ఇసుకను ఇప్పుడు అధికార యంత్రాంగం నిర్ణీత ధరలు పెట్టి విక్రయాలు మొదలెట్టింది. గతంలో దోచుకున్న ఇసుక లెక్కలు మాత్రం సంబంధిత అధికారులకు పట్టడం లేదు.

కంసాలిపాలెం వంతెనపై రాకపోకల బంద్



కంసాలిపాలెం-మాధవరం వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోన్న ఎర్ర కాలువ

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలోని కంసాలిపాలెం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామానికి ఆదివారం ఉదయం నుంచీ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో వంతెన కూలిపోవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు స్థానిక రైతులంతా కలిసి తూరలు ఏర్పాటు చేసి తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎర్ర కాలువ పోటెత్తడంతో ఈ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వంతెన వద్ద రాకపోకలు నిలిపి వేశామని సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు.

375 ఎకరాల్లో వరి పంట నీటమునక



డి.ముప్పవరం శివార్లలో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఏవో సత్యనారాయణ

నిడదవోలు రూరల్: భారీ వర్షాలకు మండలంలోని 375 ఎకరాల్లోని వరి పంట నీట మునిగినట్టు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని డి.ముప్పవరం, సమిశ్రగూడెం కలవచర్ల, కోరుపల్లి, కంసాలిపాలెం, సింగవరం, నిడదవోలు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా పైరుపై వెదజల్లే ప్రక్రియ చేపట్టాలని రైతులకు ఆయన సూచించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు శివనాగు, మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామ యువకులకు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ముప్పిడి దరన్ చేతుల మీదుగా ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిపాటి ప్రకాశరావు, చెరుకూరి వెంకట్రావు, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, కుంటముక్కల ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు



అన్నదేవరపేటలో కృషి ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

తాళ్లపూడి: వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ఖరీఫ్ వరి సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు.వేగేశ్వరపురం, పైడిమెట్ట ఎత్తిపోతల పథకాలు, బోర్ల పై ఆధారపడి మండలంలో వరి సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం వరి సాగు విస్తీర్ణం 9465 ఎకరాలు. ఇప్పటి వరకూ 2667 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. ఈ నెల 25వ తేదీ నాటికి మండలంలో దాదాపు వరినాట్లు పూర్తవుతాయని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. కొన్నేళ్లుగా రైతులు బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఎకరం పొలంలో నారు తీసి వరి నాట్లు వేయడానికి రూ.4300 వరకూ తీసుకుంటున్నారు. బెంగాల్ కూలీలు రావడంతో నాట్లు వేయడం సులభం అయ్యిందని రైతులు చెబుతున్నారు.

తల్లికి వందనం పేరుతో చంద్రబాబు దగా

- తప్పుడు వాగ్దానాలు ఆయన నైజం
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం
- పిల్లలందరికీ 'తల్లికి వందనం' వర్తింపజేయాలని డిమాండ్
- ఒక్కరికే ఇస్తామంటూ జీవో జారీపై మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

కొవ్వూరు: ఎన్నికల వేళ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తుంగలో తొక్కి, తల్లికి వందనం పథకం ద్వారా ఒక తల్లికి రూ.15 వేలు మాత్రమే అందిస్తామంటూ జీవో 29 విడుదల చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు విమర్శించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక తల్లికి ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఈ పథకం ద్వారా సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఊరూ వాడా ప్రసంగాలు ఊదరగొట్టి ఇప్పుడు మాట మారుస్తారా? అంటూ నిలదీశారు. తప్పుడు వాగ్దానాలివ్వడం చంద్రబాబు నైజం అనడానికి 29 జీవోనే నిదర్శనం అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఒకటి నుంచి 12వ తరగతి వరకూ చదివే విద్యార్థులందరికీ రూ.15 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయాలని తలారి డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2600 కోట్ల చెల్లింపు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం ద్వారా పేద,బడుగు,బలహీన వర్గాలకు పార్టీ రహితంగా రూ.15 వేల చొప్పున రూ.2,600 కోట్లు అందించారని తలారి వెంకట్రావు అన్నారు. అధికార కూటమిలో భాగస్వామి పార్టీ అయిన బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ హామీలతో తమకు సంబంధం లేదని చెప్పడం బాధాకరం అన్నారు. హామీలిచ్చి ప్రజలను మోసగించేలా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. దీనికితోడు టీడీపీ నేతలు ఆరాచకాలు, దౌర్జన్యాలు, విధ్వంసం సృష్టించడాన్ని తప్పుబట్టారు. ఎమ్మెల్యే రఘు రామకృష్ణం రాజు మూడేళ్ల తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై కేసు పెట్టడం విడ్డూరంగా ఉందని తలారి వెంకట్రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల మంది పింఛనుదారులుంటే 12 శాతం మందికి పింఛను ఇవ్వలేదన్నారు. నలభై శాతం ఓటర్లు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసిన బీఆర్ మీనాకు మూడు శాఖల ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ప్రజల్లోకి తీసుకు వెళతామన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు, చిట్టూరి అన్నవరం, కొయ్య దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు 'మానవత' తోడ్పడాలి



మండల నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు మోహనరావు

నల్లజర్ల: సమాజంలో శాంతి స్థాపనకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులంతా కృషి చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు కోరారు. ఆ సంస్థ మండల శాఖ నూతన కమిటీతో ఆదివారం నల్లజర్లలోని అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ 13 జిల్లాల్లో 45 వేల సభ్యత్వాలతో మానవత సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, మండల సమన్వయ కమిటీ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, ఐడీపీ అప్పారావు, సాగిరాజు జానకిరామరాజు, రామిశెట్టి గంగాధరరావు, గుత్తికొండ వరప్రసాద్, దావులూరి ప్రభాకరరావు తదితరులు మాట్లాడారు.

నూతన కమిటీ

మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా రుద్రపాక ఝాన్సీరాణి, కార్యదర్శిగా పాతూరి రమేష్, ఉపాధ్యక్షుడిగా అయినంపూడి రత్నాజీ, కోశాధికారిగా ఐడీపీ అప్పారావు, సహాయ కార్యదర్శి గుండాబత్తుల వరుణ్‌కుమార్, ఈసీ అవేర్‌నెస్‌గా మద్దూరి విష్ణుమూర్తి, ఈసీ ఎడ్యుకేషన్‌గా కేజేడీవీ ప్రసాద్, ఈసీ హెల్త్‌గా బోడిగడ్ల సీతారాముడు, ఈసీ ఎమర్జెన్సీగా దొండపాటి దుర్గారావు ఎన్నికయ్యారు.

మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆదివారం నగదు పురస్కారాలు అందజేసింది. ఐఐటీలో ఆల్ ఇండియా 382వ ర్యాంకు సాధించిన సింగం నితీష్ శ్రీసత్యను, తల్లిదండ్రులు దుర్గాప్రసాద్, ఝాన్సీరాణిలను సన్మానించి రూ.2వేల నగదు పురస్కారం అందజేశారు. టెన్త్‌లో మండల టాపర్లు శింగంశెట్టి శారద, మారిశెట్టి రాగహర్షిణిలను సత్కరించి చెరో రూ.1000 అందజేశారు.అన్ని మండలంలోని అన్ని హైస్కూళ్లలో టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.1000, 500 చొప్పున బహుమతులు అందజేశారు. ఈ విధంగా రూ.28 వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత విద్యాకేంద్ర కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, పల్లి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- నీట మునిగిన పంటల పరిశీలన



వెంకటాయపాలెంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం: భారీ వర్షాల వల్ల పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతుకూ అండగా ఉంటామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హామీ ఇచ్చారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లోని వరి పంట నీట మునిగింది. నీట మునిగిన పంటలను ఆదివారం ఎమ్మెల్యే మద్దిపాటి పరిశీలించారు. భారీ వర్షాలు కురిసినపుడల్లా కొవ్వాడ రిజర్వాయర్ నుంచి వస్తున్న నీటితో పంటలు మునుగుతున్నాయని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. కాలువ గట్లు వెడల్పు చేయాల్సిన, పూడికలు తీయించాల్సిన అవసరం ఉందని ఏవో బి. రాజారావు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల అమెరికాలో మృత్యువాత పడ్డ గద్దే సాయి సూర్య అవినాష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే చిట్యాల గ్రామంలో పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదల పెంపు

నిడదవోలు: గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దాంతో మిగులు జలాలను జలవనరుల శాఖ అధికారులు ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి ఎప్పటికప్పుడు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.72 మీటర్లుగా ఉంది. విజ్జేశ్వరం హెడ్ స్లూయిస్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం నీటి విడుదలను పెంచారు. దాంతో ఉప కాలువలు గోదావరి జలాలతో కళకళలాడుతున్నాయి. పశ్చిమ డెల్టాకు 6,000, మధ్య డెల్టాకు 1200, తూర్పు డెల్టాకు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 738, నరసాపురం కాలువకు 1534, అత్తిలి కాలువకు 132, తణుకు కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. కాగా ఉండి కాలువకు నీటిని విడుదలను నిలివేశారు.

వర్షాలకు కొవ్వూరు ప్రధాన రహదారి ధ్వంసం



దేవరపల్లి మండలం సున్నంబట్టీ సెంటర్లో ధ్వంసమైన దేవరపల్లి-కొవ్వూరు ప్రధాన రహదారి



దేవరపల్లి అయ్యప్పస్వామి ఆలయం వద్ద పోలవరం కుడి కాలువ వంతెనపై నిలిచిన వర్షపునీరు

దేవరపల్లి: భారీ వర్షాలకు మండలంలోని పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. దేవరపల్లి-కొవ్వూరు ప్రధాన రహదారి పలు ప్రాంతాల్లో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ గుంతల్లో వర్షపునీరు చేరడంతో గొయ్యి లోతు తెలియక వాహనదారులు వాటిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దేవరపల్లి-దుద్దుకూరు మధ్య సున్నంబట్టీ (లక్ష్మీపురం అడ్డ రోడ్డు) సెంటర్లో రోడ్డు పూర్తిగా గుంతలు పడింది. రోడ్డుకు ఇరువైపులా మట్టిగుట్టలు, రోడ్డు పల్లంగా ఉండడంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతోంది. ఈ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాగే ఇదే రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వద్ద పోలవరం కుడి ప్రధాన కాలువ వంతెనపై వర్షపు నీరు నిల్వ ఉండి ముళ్ల చెట్లు మొలిచాయి. లారీలు, బస్సులు వెళుతున్నపుడు ద్విచక్ర వాహనదారులు తప్పించుకోవడానికి పక్కకు వెళితే బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు అడుగు ఎత్తున నీరు వంతెనపై ఉంది. వారం రోజులుగా వంతెనపై నీరు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోయే వరకూ పట్టించుకోరా? అని వారు ప్రశ్నిస్తున్నారు.

వంతెనపై ఉన్న నీరు బయట వెళ్లడానికి ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ మట్టితో పూడుకుపోయాయని ప్రయాణికులు తెలిపారు. మట్టిని తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. దుద్దుకూరు మలుపు వద్ద, గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రం సమీపంలో కూడా రోడ్డు ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా క్వారీల మట్టి గుట్టలు వేయడం వల్ల వర్షపు నీరు రోడ్డుపై ఉండిపోతోంది.

దీంతో రోడ్డు గోతులు పడి రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. భారీ వాహనాలు వచ్చినపుడు తప్పించుకోవడానికి కనీసం మార్జిన్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారులపై గల మట్టి గుట్టలను తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.